# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 25, మార్చి 2026


అడెల్లి మహా పోచమ్మ ఆలయ హుండీ ఆదాయం

# రూ.53.97 లక్షలు

**సారంగాపూర్, మార్చి 24, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అడెల్లి మహా పోచమ్మ దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 15 హుండీలను తెరిచి లెక్కించగా.. రూ. 53,97,520 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. నగదుతో పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన 125 గ్రాముల 490 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల మిశ్రమ వెండి లభించినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని దేవస్థాన అధికారిక బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భూమయ్య, పరిశీలకులు జి. వేణుగోపాల్ గుప్తా, ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, కౌట్ల (బి), సారంగాపూర్, అడెల్లి, స్వర్ణ, ఆలూరు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో లెక్కింపులో పాల్గొన్నారు. హుండీ లెక్కింపు సేవలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ ఈఓ, చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.



# రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

■ ఆకస్మిక తనిఖీల్లో కలెక్టర్ హరిత కఠిన ఆదేశాలు

**పెంచికల్‌పేట్, మార్చి 24, ప్రభాతవార్త :**



వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే దిశగా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హరిత అదేశించారు. మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వ గది, రోగుల వార్డు పరిశీలించి, సేవల నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా గైర్హాజరు అయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లోనూ తనిఖీలు...అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు, మెను పట్టిక, సరుకుల నిల్వలు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా భోధన అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరా...బొంబాయిగూడ గ్రామంలోని ఆదర్శ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీ స్త్రీల సంఖ్య, ప్రసవానికి సిద్ధంగా ఉన్న వారి వివరాలు (మిగతా 2లో..)

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్



**సారంగాపూర్, మార్చి 24, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యమైన మెటీరియల్ ఉపయోగిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం (మిగతా 2లో..)

# అకాలవర్షాల బీభత్సం



## ఈదురుగాలులకు 10 ఇళ్ల పైకప్పులు ధ్వంసం

– బజార్‌హత్నూర్, మార్చి 24, ప్రభాతవార్త:

2లో..



# ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు

☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 24, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చి విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా సౌర విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య (మిగతా 2లో..)



# రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. వారికి పోషకహారం క్రమం తప్పకుండా అందించాలని అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. వంద శాతం హాజరుపై దృష్టి...ఎంపీయూపీఎస్ పాఠశాల తనిఖీ చేసి విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం అందించాలని, భోధన నాణ్యత మెరుగుపరిచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపివో మహేందర్, ఆర్ఐ రాజేశ్వర్, ఎల్కపల్లి సర్పంచ్ రాంచందార్, పంచాయతీ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

(మొదటిపేజీ తరువాయి)

అమలును పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరీక్షించేందుకు వారితో కలిసి భోజనం చేశారు. భోజనం ఏ విధంగా పెడుతున్నారు, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో, పరీక్షల మధ్యలో వచ్చే సెలవు దినాల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ భోజన్న, ఎంఈఓ మహేందర్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మికాంత్, సర్పంచ్ వెన్నెల సాయన్న, ఏపీఓ సాగర్, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

## - కలెక్టర్ కుమార్ దీపక్‌కు విగ్రహ సాధన కమిటీ వినతి

నస్పూర్, మార్చి 24, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ విగ్రహ సాధన కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్తగా భారతదేశానికి జగజ్జీవన్ రామ్ అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గుర్తు చేశారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఆయన స్మారకార్థం జిల్లా కేంద్రంలో విగ్రహాన్ని ప్రతిష్టించాల్సిన అవసరం ఉందని అన్నారు. జగజ్జీవన్ రామ్ ఆశయాలను భావితరాలకు అందించడానికి విగ్రహ ఏర్పాటు దోహదపడుతుందని సభ్యులు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ సాధన కమిటీ సభ్యులు చంద్రగిరి నరేష్, దాసరి విజయ్ సాగర్, తోటపల్లి మహేందర్, లింగంపెల్లి నరేష్, నునవత్ భీమ్యా నాయక్, కోండ్ర ఉదయ్ కిరణ్, గుంపుల స్వామి తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాల బీభత్సం

బజార్‌హత్నూర్, మార్చి 24, ప్రభాతవార్త:



మండలంలో సోమవారం కురిసిన అకాల వర్షం పలు గ్రామాల్లో భారీ బీభత్సాన్ని సృష్టించింది. ముఖ్యంగా కొల్హారి గ్రామంలో ఈదురు గాలుల ధాటికి దాదాపు పది ఇళ్ల పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆకస్మికంగా కురిసిన ఈ వర్షం వల్ల జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో విద్యుత్ తీగలపై భారీ వృక్షాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామంలోని పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలడంతో రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక సర్పంచ్ మెండేకే సాయినాథ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. రహదారులపై అడ్డంగా పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు.

# ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార వాహనాన్ని రెడ్ కో ఆదిలాబాద్ డి.ఎం. ఎల్. శ్రీనివాస్, టిజీఎన్‌పిడిసిఎల్ ఎస్.ఈ. రాజన్న ఇతర అధికారులతో కలిసి ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పథకం అమలు చేయడం జరుగుతుందని, 1 కిలో వాట్‌కు 30 వేల రూపాయలు, 2 కిలోవాట్లకు 60 వేల రూపాయల రాయితీ కాగా 18 వేల రూపాయల వరకు ప్రతి కిలోవాట్ కు, జి.హెచ్.ఎస్./ఆర్.డబ్ల్యూ.ఎ. (సాధారణ సౌకర్యాలు, ఈ.వి. చార్జింగ్) కోసం 500 కిలోవాట్ల వరకు రాయితీ అందుబాటులో ఉంటుందని, 3 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ విద్యుత్తుకు 78 వేల రూపాయలు కాగా రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సోలార్ ద్వారా నెలవారి వినియోగం, విద్యుత్ బిల్లులు, కాలుష్యం తగ్గించుకోవచ్చని, మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేస్తే నెట్ మీటరింగ్ ద్వారా డిస్కం నుంచి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు, సోలార్ కు అనుకూలమైన సొంత రూఫ్ టాప్ కలిగి గతంలో సోలార్ రాయితీ పొంది ఉండకూడదని తెలిపారు. జాతీయ పోర్టల్ ద్వారా www.pmsuryaghar.gov.in లో, అధికృత వెండర్ల ఎంపిక, దరఖాస్తు ట్రాకింగ్ చేసుకోవచ్చని, 3 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థకు షూరిటీ అవసరంలేని వడ్డీ రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డి.ఈ. మంచిర్యాల డి.మల్లేశం, ఎడిఈ కమర్షియల్ జి. మోహన్ రెడ్డి, ఎడిఈ మంచిర్యాల రూరల్ రాజశేఖర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ స్థాయిలో ప్రతిభ చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

## - ఐఎన్‌టిఎస్‌ఓ ఒలింపియాడ్‌లో ఘన విజయాలు

బెల్లంపల్లి, మార్చి 24, ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టిఎస్‌ఓ) పరీక్షల్లో మందమర్రికి చెందిన శ్రీ చైతన్య విద్యాసంస్థ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అద్భుత విజయాలను సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేస్తూ, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కలిసొచ్చిన ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు. ఈ ఒలింపియాడ్ పరీక్షలు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పాల్గొనే ప్రతిష్టాత్మక పరీక్షలు కావడం గమనార్హం. అలాంటి పోటీ వాతావరణంలో మండమర్రి వంటి ప్రాంతం నుంచి విద్యార్థులు అగ్రస్థానాలు సాధించడం విశేషమని ఆయన అన్నారు. ఈ పరీక్షల్లో మొదటి బహుమతి 8వ తరగతి విద్యార్థి తుంగపిండి వర్షత్ లెనోవా టాబ్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చాడు. అతని కృషి, పట్టుదల, గురువుల మార్గ దర్శకత్వం ఈ విజయానికి కారణమని తెలిపారు. రెండవ బహుమతి 6వ తరగతి విద్యార్థి బండారి విష్ణువర్ధన్, 5వ తరగతి విద్యార్థి దండు దేవాన్ష్ స్మార్ట్ వాచ్‌తో పాటు గోల్డ్ మెడల్ అందుకున్నారు. వీరు నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకున్నారని ఉపాధ్యాయులు అభినందించారు. మూడవ బహుమతి 7వ తరగతి విద్యార్థిని గోవర్ధనగిరి శ్రీ సుధామినీ, 3వ తరగతి విద్యార్థి దండు దేశిక రెడ్ బోల్ట్ బ్యాగ్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. చిన్న వయస్సులోనే ఈ స్థాయి ప్రతిభ కనబరచడం విశేషమని పేర్కొన్నారు. నాలుగో బహుమతి 10వ తరగతి విద్యార్థి సిరికొండ సాద్విన్, 8వ తరగతి విద్యార్థి చెరుకు శ్రీమన్, 4వ తరగతి విద్యార్థి పొన్నం శ్రీ కరణ్ స్పోర్ట్స్ వాచ్‌తో పాటు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఐదవ బహుమతి 9వ తరగతి విద్యార్థిని సబ్బని అనిక, అక్కేపల్లి లాస్య, 5వ తరగతి విద్యార్థి కొయ్యాడ సాహిత్ గౌడ్ లంచ్ బాక్స్‌తో పాటు గోల్డ్ మెడల్స్ పొందారు. ఇవే కాకుండా మొత్తం 138 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, గోల్డ్ మెడల్స్ సాధించి తమ ప్రతిభను మరోసారి రుజువు చేశారు. ఇది పాఠశాల స్థాయిలో ఒక గొప్ప విజయంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం అరవింద రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రైమరీ కోఆర్డినేటర్ జయశ్రీ, ప్రిన్సిపాల్ రమేష్, డీన్ రవికుమార్, ఒలింపియాడ్ ఇన్చార్జ్ శ్యామల, రవీనా, ప్రైమరీ ఇన్చార్జ్ సునీత, ప్రీప్రైమరీ ఇన్చార్జ్ తిరుమలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులలో పోటీ భావన, విశ్లేషణా సామర్థం, సమస్య పరిష్కరణ నైపుణ్యాలను పెంపొందించడంలో ఐ ఎన్ టి ఎస్ ఓ వంటి పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అవసరమైన విద్యా వాతావరణం, నాణ్యమైన బోధన, సాంకేతిక సదుపాయాలు అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థుల ఈ ఘన విజయాలు మందమర్రి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాయని పేర్కొన్నారు.

# క్షయ వ్యాధిపై కట్టుదిట్టమైన చర్యలు.. ముందస్తు గుర్తింపే రక్షణ

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**- టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో అవగాహన - అభివృద్ధి పనులపై సమీక్ష**

మందమర్రి, మార్చి 24, ప్రభాతవార్త

క్షయ వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి సరైన సమయంలో చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్ నాయక్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని గుర్తించడానికి తెమడ పరీక్షలు, ఎక్స్ రేలు ఉపయోగపడతాయని, సమయానికి చికిత్స అందించినట్లయితే వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 100 రోజుల పాటు ప్రత్యేక చర్యలు చేపట్టి అన్ని గ్రామపంచాయతీల్లో పరీక్షలు, చికిత్సలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ ప్రభావిత ప్రాంతాల్లో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, పోషకాహార లోపం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించడం ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. సకాలంలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందుతుందని, స్వయంగా మందులు వినియోగించకుండా వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలని సూచించారు. జిల్లాలో ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కీలు ఫౌండేషన్ ద్వారా న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని, నిశ్చయ భూషణ్ యోజన కింద ప్రతి నెల రూ.1000 చొప్పున పోషకాహారం కోసం అందజేస్తున్నామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మాస్క్ ధరించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని, గాలి, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. జిల్లాలో 759 మంది క్షయ రోగులకు చికిత్స అందిస్తుండగా, డీబీటీ ద్వారా పలువురికి పోషకాహారం కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.



అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇక పొన్నారం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామ నర్సరీని సందర్శించి వేసవి నేప థ్యంలో మొక్కలకు సమయానికి నీరు అందిం చడంతో పాటు సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో రాజేశ్వర్, వైద్యాధికారులు డా. అరుణశ్రీ, డా. రమేష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## బోథ్ నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతి

నేరడిగొండ, మార్చి 24, ప్రభాతవార్త:

బోథ్ నియోజకవర్గంలోని క్రీడాకారుల సౌకర్యార్థం మినీ స్టేడియం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేసి నియోజకవర్గంలోని క్రీడా వసతులపై చర్చించారు. ముఖ్యంగా బోథ్ మండల కేంద్రంలో నూతనంగా మినీ స్టేడియం మంజూరు చేయాలని, అలాగే ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పెండింగ్ పనుల కోసం అదనపు నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని, స్టేడియం అందుబాటులోకి వస్తే వారిని మరింతగా ప్రోత్సహించే అవకాశం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ నిధుల మంజూరుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ ఆడే గజేందర్

## ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపిన ఆడే గజేందర్

నేరడిగొండ, మార్చి 24, ప్రభాతవార్త:

బోథ్ పట్టణ కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే గజేందర్ మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ.. బోథ్ ప్రాంత అభివృద్ధిపై మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ వహించడం అభినందనీయమన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఫైర్ స్టేషన్ కల నెరవేరడం వల్ల అత్యవసర సమయంలో అగ్నిప్రమాదాల నుండి ప్రజల ఆస్తులను కాపాడుకోవచ్చని, సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి మంత్రి ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుల అరుణ్, జెల్కె పాండురంగ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.



## లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్‌ల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

హాజీపూర్, మార్చి 24, ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సర్వే ట్రైనింగ్ పొంది, సర్టిఫికెట్స్ పొందిన సర్వేయర్ లు మంచిర్యాలలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్‌ల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ముల్కల్ల సందీప్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అపర్ణ, రాజ్‌కుమార్, తిరుపతి, గంగాధర్, జనరల్ సెక్రటరీగా కుమారస్వామి, సెక్రటరీగా బండి సాయికృష్ణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కార్తిక్, మీడియా కోఆర్డినేటర్‌గా అగ్గు సంతోష్, అడ్వైజర్‌గా సరమ్ వినోద్ ఎన్నికయ్యారు. అలాగే ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సంఘ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## సీఎం రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పాటిల్

భైంసా, మార్చి 25, ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతుకు ఒకే రోజు రూ.6,000 చొప్పున రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నారాయణరావు పాటిల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బుధవారం భైంసా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వానికి రైతాంగం అండగా ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల వలె కాకుండా, పారదర్శకంగా నేరుగా రైతుల ఖాతాల్లోనే నిధులు జమ చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మమ్మాయి రమేష్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శ్యామ్ రావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, మాజీ ఎంపీపీ నారాయణ రెడి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పాటిల్

## దేగాం అభివృద్ధికి రూ.65.50 లక్షల నిధులు

**- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి**

భైంసా, మార్చి 25, ప్రభాతవార్త:



భైంసా మండలం దేగాం గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం రూ.65.50 లక్షల నిధులను మంజూరు చేసిందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆయన, రూ.43.50 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటికే రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.10 లక్షలతో మహిళా సంఘం భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. శ్రీనివాస్, వార్డు సభ్యులు సుదర్శన్ గౌడ్, నాగేష్, సాయి, చోటు, సట్ల కిషత్తన్న, చందురెడ్డి, లక్ష్మణ్, అప్పం చందు, రమేష్, సాయిలు, ముత్తన్న, రాకేష్, పోతన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ట్రేడ్స్‌మెన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఐఎన్‌టీయూసీ డిమాండ్ - శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం అందజేత



జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్ టీయూసీ నాయకులు

**నస్పూర్, మార్చి 24, ప్రభాతవార్త**

ట్రేడ్స్ మెన్స్ ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ట్రేడ్స్ మెన్స్ పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌కు యూనియన్ ప్రతినిధులు మెమోరాండం అందజేశారు. రక్షణ పరికరాల కొరత, పని భారం, వేతన వివక్ష వంటి అంశాలపై వారు నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల భద్రతను విస్మరిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. గనిలో పనిచేసే ట్రేడ్స్ మెన్స్‌కు టూల్స్, టూల్ బ్యాగ్స్, సేఫ్టీ గ్లోవ్స్ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించడం లేదని నాయకులు ఆరోపించారు. ఉద్యోగులే సొంతంగా పనిముట్లు కొనుక్కోవాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. టెక్నీషియన్ల కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందిపైనే అధిక పని భారం మోపుతున్నారని విమర్శించారు. అత్యవసర పనుల కోసం పిలిపించినప్పటికీ ఈ అండ్ ఎం సిబ్బందికి అదనపు మస్టర్లు లేదా ఓవర్ టైం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ సిబ్బందికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ సాంకేతిక సిబ్బంది పట్ల స్పష్టమైన వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. గనుల్లో హెల్పర్లు లేకపోవడం, సరైన పర్యవేక్షణ లోపించడం వల్ల పని ప్రదేశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత విద్యుత్ వ్యవస్థ, కాలం చెల్లిన కేబుల్స్, సబ్‌స్టేషన్లు, బలహీనమైన కమ్యూనికేషన్ వ్యవస్థతో కార్మికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని వివరించారు. కోల్ మైన్స్ రెగ్యులేషన్స్ 2017, డీజీఎంఎస్ నిబంధనలను యాజమాన్యం తుంగలో తొక్కుతోందని ధ్వజ మెత్తారు. కార్మికులకు కనీస విశ్రాంతి గదులు, పిట్ హెడ్ బాత్ సౌకర్యాలు కూడా లేవని గుర్తు చేశారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, డీజీఎంఎస్ నిబంధనల మేరకు రక్షణ శిక్షణ ఇవ్వాలని ఐఎన్ టీయూసీ కోరింది. ఎలక్ట్రీషియన్లకు తక్షణమే నాణ్యమైన పీపీఈ కిట్లు అందించాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమా లు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెట్టి శంకర్ రావు, పేరం రమేష్, గరిగె స్వామి, రవీందర్‌రెడ్డి, గుర్రపు సతీష్, మరేపల్లి బాపు, మారుతి, గోపాల్ రెడ్డి, రమేష్, నంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ టేబుల్స్ విరాళంగా ఇచ్చిన సర్పంచ్

**జన్నారం, మార్చి 24, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామ సర్పంచ్ వాసాల నరేష్ నాలుగు కంప్యూటర్ టేబుల్స్‌ను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసాల నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో గానీ, జాతీయ ఉపకార వేతనాల్లో గానీ, టాలెంట్ పరీక్షల్లో గానీ, ఆటల పోటీల్లో గానీ జిల్లా రాష్ట్రస్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్, బాణావత్ ప్రకాష్, రాజన్న, గుండి నరహరి శర్మ, రిటైర్డ్ హెచ్‌ఎం నోముల మధుసూదన్, గట్టు మహేష్, నాగరాజు, దేవేందర్, రాజేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**వేమనపల్లి, మార్చి 24, ప్రభాతవార్త**



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలం నుంచి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని నిరసిస్తూ బిఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బిఆర్ఎస్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్, చెన్నూరి సంతోష్, చెన్నూరి ప్రసాద్, దుర్గం సుధాకర్, అదే నాగేష్‌లను నీల్వాయి పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని, విద్యారంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు.

## ప్రజల కోసం ప్రభుత్వం..

- కాంగ్రెస్ నేతల చేతుల మీదుగా సహాయం
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**మందమర్రి, మార్చి 24, ప్రభాతవార్త**

కార్మిక మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆదేశాల మేరకు మందమర్రి పట్టణంలోని 24 వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్, ఆకారం రమేష్, నెరువట్ల శ్రీనివాస్, ఎండి జమీల్, మంద తిరుమల్, ఎర్ర రాజు, సట్ల సంతోష్, రాకం సంతోష్, మాయ తిరుపతి, సుకూర్, జావిద్ ఖాన్, గజ్జెలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఈ సహాయం ఎంతో ఉపయుక్తమని, ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

## రైతు భరోసా నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం

**జన్నారం, మార్చి 24, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రజా పాలనలో రైతును రాజు చేయాలనే లక్ష్యంతో రైతులకు తొలి విడతగా రైతు డబ్బులను విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు కుదిరె వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా నిధులు విడుదల చేయడం వలన పంట పెట్టుబడికి ఉపయోగపడుతాయాని రైతులు, అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. యాసంగి సీజన్ రైతు భరోసా డబ్బులు సకాలంలో అందడం వల్ల విత్తనాలు, ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎంతో మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేటు అప్పుల నుండి బయటపడతారని, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు.



## యువజన కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక

**లక్షెట్టిపేట, మార్చి 24, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం నూతన బాడీని ప్రకటించారు. మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు రాందేని వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ గెస్ట్ హౌస్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపాలిటీ యూత్ ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి శ్రీకర్, కండి మొగిలి, బోడకుంట మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మంచిర్యాల అసెంబ్లీ సెక్రటరీగా దొంత కార్తీక్, వైస్ ప్రెసిడెంట్‌గా మల్యాల శివ కుమార్, టౌన్ సెక్రటరీగా బిలాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి నూతన యూత్ బాడీ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వేం నరేందర్ రెడ్డిను సన్మానిస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**సారంగాపూర్, మార్చి 24, ప్రభాతవార్త:**

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని నరేందర్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన, ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాలు, ప్రాంతీయ అభివృద్ధి అంశాలపై కొద్దిసేపు చర్చించారు. మాజీ మంత్రితో పాటు నిర్మల్ జిల్లా మాజీ జడ్పిటిసిల ఫోరం అధ్యక్షుడు, సారంగాపూర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కూడా వేం నరేందర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ స్థాయిలోని పలువురు నాయకులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## పంచముఖ హనుమాన్ ఆలయంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా పారాయణం

- భక్తి శ్రద్ధలతో 108 సార్లు పారాయణం - స్వామి ఆశీస్సులు పొందాలని పిలుపు

**మందమర్రి, మార్చి 24, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ప్రాంతంలో గల పంచముచ హనుమాన్ ఆలయంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా పారాయణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. మాల ధారణ స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని 108 సార్లు హనుమాన్ చాలీసాను పారాయణం చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య ఆచార్య మాట్లాడుతూ పవిత్ర భక్తితో స్వామిని ప్రార్థించిన వారి కోరికలు నెరవేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో దాదాపు 800 మంది స్వాములు మాలధారణ చేపట్టి దీక్షలో పాల్గొంటారని తెలిపారు. అలాగే మార్చి 27న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని పారాయణంలో పాల్గొన్నారు. ఆలయం భక్తి పరవశంతో నిండిపోయింది.





## నర్సింగాపూర్, శివ్వారం గ్రామ పంచాయతీలను సందర్శించిన మండల పంచాయతి అధికారి

**జైపూర్, మార్చి 24, ప్రభాతవార్త**

మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు మొబైల్ యాప్ తనిఖీలో భాగంగా జైపూర్ మండలంలోని నర్సింగాపూర్, శివ్వారం గ్రామ పంచాయతీలను మంగళవారం సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని, గ్రామ పంచాయతీ పంచాయతీ కార్యదర్షులకు సూచించారు. రహదారులు మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తెలియచేశారు. సెగ్రిగేషన్ షెడ్‌లో కంపోస్టు ఎరువు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వాటర్ అండ్ శానిటేషన్ కు సంభందించిన 7 రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వాటర్ ట్యాంక్ చుట్టూ శుభ్రం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో నర్సింగపూర్, శివ్వారం పంచాయతీ కార్యదర్శి, సుప్రియ, ప్రవీణ్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అక్కపల్లి గూడెం పాఠశాల విద్యార్థులు

**జన్నారం, మార్చి 24, ప్రభాతవార్త**

జన్నారం మండలం అక్కపల్లి గూడెం ఎం పి పి ఎస్ పాఠశాల విద్యార్థులు గురుకుల విద్యా సంస్థలో జరిగిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి 22 మంది విద్యార్థులు సీట్లు సాధించారని ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంత మంది విద్యార్థులు సీట్లు సాధించడం రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటిసారి అని కొనియాడారు. ఇట్టి విద్యార్థులను ఎం ఇ వో నడిమెట్ల విజయ్ కుమార్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు ఎ. కరుణ, పి. మోనిక, ఎస్. రాజశేఖర్, బి. మహేష్, బి. శ్రీకాంత్, సుదీప, శ్రీలత, నాజియాలను ఎం ఈ వో నడిమెట్ల విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రేండ్ల గూడెం ఉపాధ్యాయులు జి శ్రీలత, ఎం. మంజుల పాల్గొన్నారు.

### వివేకానంద పాఠశాల విద్యార్థుల ప్రతిభ..

జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన వివేకానంద పాఠశాల విద్యార్థులు 2026వ సంవత్సరం గురుకులంలో 5వ తరగతి ప్రవేశ పరీక్షలో మొదటి పేస్ లోనే 18 మంది విద్యార్థులకు గాను 15 మంది విద్యార్థులు సీట్లు సాధించడం గొప్ప విషయమని, చాలా గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, ఇన్చార్జిలు తిరుపతి, మహేష్ లు విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అలాగే కామన్ పల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.రాజేందర్, బి. పవన్, జె. శ్రీవేణి, జె. సాహితి, టి. సాగరిక , డి. శ్రీనిత్య, జె. నిచల్ విద్యార్థులు కూడా గురుకులం లో ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీమల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.




# లంబడితండా రోడ్డు శుభ్రతలో ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తి

### విద్యుత్ ప్రమాదాలపై అవగాహనతో శిబిరం ఘన విజయం






**బెల్లంపల్లి, మార్చి 24, ప్రభాతవార్త**

సమాజ సేవకు అంకితభావంతో ముందుకు సాగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం రెండో రోజు మంగళవారం లంబడితండా గ్రామంలో ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ముందు నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న మార్గాన్ని వాలంటీర్లు, అధ్యాపకులు కలిసి శుభ్రపరిచారు. రహదారి ఇరువైపులా పెరిగి ప్రయాణానికి ఆటంకంగా మారిన పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు, పొదలు, చెత్తను పూర్తిగా తొలగించారు. వాలంటీర్లు చేతులతోనే కష్టపడి రోడ్లను ఊడ్చి శుభ్రం చేయడం గ్రామస్థులను ఆకట్టుకుంది. తొలగించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో గ్రామం బయటకు తరలించి పారబోశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో శుభ్రత పై అవగాహన పెంపొందడమే కాకుండా, యువతలో సేవా భావం మరింత బలపడుతుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఎంఎ రేష్మ, గజెల్లి మోహన్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం సజావుగా జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్, ఉప సర్పంచ్ రంగ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ఏకాంబరం, అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళీకృష్ణ, వంశీకృష్ణ, సునీల్ కుమార్ తదితరులు పాల్గొని వాలంటీర్లను ప్రోత్సహించారు. గ్రామ ప్రజలు కూడా ఈ శుభ్రత కార్యక్రమంలో భాగస్వాములై విద్యార్థుల కృషిని అభినందించారు. విద్యుత్ ప్రమాదాలపై సమగ్ర అవగాహన కార్యక్రమం శిబిరంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన విద్యార్థులకు విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను విపులంగా వివరించారు. ముఖ్యంగా ఎండాకాలంలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, అటువంటి సమయంలో అధిక లోడ్లు, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే వర్షాకాలంలో తడి ప్రదేశాల్లో విద్యుత్ పరికరాలను వాడేటప్పుడు అత్యంత జాగ్రత్తలు అవసరమని సూచించారు. విద్యుత్ ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తమ ప్రాణాలను, ఆస్తులను కోల్పోతున్న దుర్ఘటనలను ఉదాహరణలతో వివరించిన ఆయన, విద్యార్థులు ఈ విషయాలను తెలుసుకొని తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. గ్రామస్థులకు కూడా విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు. ఈ విధంగా శుభ్రత కార్యక్రమంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎన్ఎస్ఎస్ శిబిరం గ్రామాభివృద్ధికి దోహదపడుతూ ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎంఎ రేష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ఏకాంబరం, అధ్యాపకులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జావిద్, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల 95వ వర్ధంతి వేడుకలు

## భగత్‌సింగ్ స్ఫూర్తి తో పోరాటాలు

### - టి ఏ జి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

**ఉట్నూర్,మార్చి 24, ప్రభాతవార్త :**

భగత్ సింగ్ స్ఫూర్తితో పేద ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలను నిర్మిస్తామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుసాడి గుట్ట లో భగత్ సింగ్, సుఖ్ దేవ్ రాజ్ గురుల 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పూసం సచిన్ మాట్లాడుతూ....భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు ఈ దేశ స్వాతంత్రం కోసం 23 ఏండ్ల వయస్సులో ప్రాణాలను బలిదానం చేసారని కొనియాడారు. ఈ దేశంలో సమసమాజం రావాలని, కుల, మత రాజకీయాలు లేని దేశం నిర్మాణం కావాలని ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ తమ విలువైన ప్రాణాలు అర్పించారాని అన్నారు. నేడు కేంద్రం లో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సార్వ బౌమత్వం తాకట్టు పెట్టేలా అమెరికా తో దోస్తీ విధానాలు ఆవలంబిస్తున్నారని దుయ్యాబెట్టారు. భగత్ సింగ్ ఆశించిన సమసమాజం కోసం ప్రజా సంఘాలు పోరాడుతామని తెలిపారు. భగత్ సింగ్ కు కేంద్రం ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా కార్యదర్శి అన్నామొల్లా కిరణ్,సీఐటీయూ ఉట్నూర్ మండల నాయకులు .రత్నామాల, అర్కా వెంకట్రావు, సంతోషమ్మ, రజిత, లక్ష్మి,సురేఖ,బీమవ్వ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.కె-5 గనికి పూర్వవైభవం తీసుకురావాలి

### - 100 శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించాలి
### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, మార్చి 24, ప్రభాతవార్త**

అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేసి ఆర్.కె-5 గనికి పూర్వవైభవం తీసుకురావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఆర్.కె 5 గనిని సందర్శించి అధికారులతో కలిసి భూగర్భంలోని పని ప్రదేశాలను పరిశీలించారు. 5వ సీమ్ డెవలప్మెంట్ డిస్ట్రిక్ట్‌లో బొగ్గు ఉత్పత్తి తీరుతెన్నులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధన కోసం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అంతకుముందు మేనేజర్ కార్యాలయంలో ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో గని నిర్వహణ, రక్షణ, భద్రతా ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 95 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన కొద్ది రోజుల్లో నూటికి నూరు శాతం వార్షిక ఉత్పత్తి సాధన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. 5వ సీమ్ నార్త్ సైడ్‌లో మరింత బొగ్గు వెలికితీసే అవకాశం ఉందని ఈ సందర్భంగా గుర్తించారు. దీనివల్ల గని జీవితకాలం మరో రెండు లేదా మూడేళ్లు పెరిగే వీలుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గ్రూప్ ఇంజనీర్ భట్టాచార్య, గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, రక్షణ అధికారి శివయ్య, ఇంజనీర్ శ్యామ్ కుమార్, సర్వేయర్ ఏ. సంపత్ హాజరయ్యారు. పలువురు మైనింగ్ సిబ్బంది, సూపర్వైజర్లు పాల్గొన్నారు.




నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య


గ్రామపంచాయతీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ చంద్రయ్య

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**తాండూర్, మార్చి 24, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ను అధికారులు పగడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య అన్నారు. తాండూర్ గ్రామ పంచాయతీలోని పలు వార్డులలో మంగళవారం అదనపు కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోనీ నర్సరీ, శానిటేషన్ వర్క్స్, ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంక్ లను పదిరోజులకు ఒకసారి శుభ్రపరచాలని, పైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలని, వీధి దీపాలు పగలు వెలగకుండా చూడాకన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కోరత లేకుండా చూడాలని ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు ఇండ్లు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కోరత లేకుండా చూడాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్, డిపిఓ సతీష్ కుమార్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, కార్యదర్శి దివాకర్, పంచాయతీ రాజ్ ఏఈ సాయిలత, వ్యవసాయ అధికారిని సుష్మా, ఉపసర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపిపి సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ ఈసా, ఆర్ఐ ఎజాజ్జోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన సర్పంచ్

## బోర్‌వెల్ పనులకు శ్రీకారం

**పెంచికల్‌పేట్, మార్చి 24, ప్రభాతవార్త :**

మండలంలోని పోతేపల్లి గ్రామంలో నూతన బోర్ వెల్ పాయింట్ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ దుర్గం పోశన్న కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామానికి త్రాగునీటి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**పెంచికల్‌పేట్, మార్చి 24, ప్రభాతవార్త :**


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవీందర్

మండలంలోని ఎల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడలో రూ 10 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ చప్పిడి రవీందర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో బురద, గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సీసీ రోడ్డు నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతారని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు కుకిడే రాజేశ్వర్, నాయకులు సత్యనారాయణ, భీమయ్య, శ్రీకాంత్, మోహన్,వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్తపల్లి వారసంత వేలంపాట

**తాండూర్, మార్చి 24, ప్రభాతవార్త :**

మండలంలోని ఐ.బి. సమీపంలో ప్రతి శనివారం నిర్వహించే కొత్తపల్లి వారసంత 2026 27 సంవత్సరానికి గాను బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ ఆకుల వెంకటేష్ తెలిపారు. ఈనెల 25న మధ్యాహ్నం12 గంటలకు వారసంత ఆవరణలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు మేకల మార్కెట్ కు రూ.50వేలు, కూరగాయల మార్కెట్ కు రూ.25 వేలు సకాలంలో డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు

## నూతన ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

**సిర్పూర్ (టి), మార్చి 24, ప్రభాతవార్త:**




సిర్పూర్ టి నూతన ఎస్సైగా డి సాగర్ మంగళవారం బాధ్యత స్వీకరించారు. ఆయన మంథని లో పనిచేసి బదిలీపై సిర్పూర్ ఎస్సైగాబాధ్యతలు చేపట్టారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**- సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల**

**సిర్పూర్ (టి), మార్చి 24, ప్రభాతవార్త:**



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కష్టపడి చదువుకొని ఉన్నతగా ఎదగాలని ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని వాటిని నివృత్తి చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి సమాజంలో మీకంటూ పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల అన్నారు. మంగళవారం రోజున జడ్పీఎస్ఎస్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని తెలిపారు.ఆమె వెంట తహసిల్దార్ రహీముద్దీన్ ఇన్చార్జ్ ఎంఈఓ సదాశివుడు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం నిర్వహిస్తున్న స్వాములు

## వైభవంగా ఆంజనేయ స్వామికి అభిషేకం

**తాండూర్, మార్చి 24, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం టౌన్షిప్ లో గల శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం శ్రీ ఆంజనేయస్వామికి అభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ముద్దు అవధూత శర్మ హనుమాన్ స్వాములతో భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేక కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు హనుమాన్ చాలీసా పారాయణము, శ్రీరామ జయరామ నామస్మరణతో మారు మ్రోగింది. అనంతరం అన్నసంతార్పణ నిర్వహించారు.



## 2026-27 వార్షిక ప్రణాళిక ప్రతిపాదనలు ఖరారు

**ఉట్నూర్,మార్చి 24, ప్రభాతవార్త :**

గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఉట్నూర్ డివిజన్ పరిధిలో 202627 ఆర్థిక సంవత్సరానికి రూ. 176.20 కోట్ల తో వార్షిక ప్రణాళిక ప్రతిపాదనలు ఖరారు చేసినట్లు జీసీసీ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమల్ల సందీప్ కుమార్ తెలిపారు. ఆమోదం కోసం జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కి ప్రతిపాదనలు పంపనున్నం అన్నారు మంగళవారం ఉట్నూర్ డివిజన్ కార్యాలయం లో డివిజన్ లోని మేనేజర్లు, అకౌంటెంట్లు మరియు సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రధానంగా ఈ ఆర్థిక సంవత్సరం లో చిన్న తరహా అటవీ ఫలసాయం (అటవీ ఉత్పత్తుల సేకరణ), వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ (ధాన్యం, మొక్కజొన్న, సోయా మొదలైనవి) కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.నూతన డీఆర్ డిపోల నిర్మాణం, మరమ్మతులు, బియ్యం తో పాటు ఇతర నిత్యావసర వస్తువులు సైతం అందుబాటులో ఉంచుతాం అని తెలిపారు.ఈ కార్యక్రమం లో సీనియర్ మేనేజర్లు సంతోష్ కుమార్, తారాచంద్, శ్రీనివాస్, రమేష్, మనోహర్, లక్ష్మణ్, సిబ్బంది లింబారావు, సత్యనారాయణ, సంతోష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు

## రైలు కిందపడి మహిళ మృతి

**తాండూర్, మార్చి 24, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబి చౌరస్తా సమీపంలో గల రైల్వే ట్రాక్ పై మంగళవారం ఫర్హానా (29) అనే మహిళ రైలు కిందపడి మృతి చెందినట్లు బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. బెల్లంపల్లి సుభాష్ నగర్ కు చెందిన ఫర్హానా మతిస్థిమితం సరిగా లేక గుర్తు తెలియని కిందపడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


మృతి చెందిన ఫర్హానా

## డిగ్రీలో అదనపు కోర్సులు మంజూరు

**ఉట్నూర్, మార్చి 24, ప్రభాతవార్త :**

ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్య సంవత్సరం నుంచి బి.కామ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, బి.ఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ అదనపు కోర్సులు మంజూరైనట్లు ప్రిన్సిపల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. దీంతో జిల్లాలోని యువతకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో నూతన కోర్సులను ప్రారంభిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓటర్ జాబితాపై బి ఎల్ వోలకు అవగాహన సదస్సు

**సిర్పూర్ (టి), మార్చి 24, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని జిశాన్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం రోజున తాసిల్దార్ రాహీముద్దీన్ బి ఎల్ ఓలకు అవగాహన సదస్సు కల్పించారు. ఆయన మాట్లాడుతూబూత్ లెవెల్ లోఓటర్ జాబితాలపై తొలగింపులు 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల పేర్లనమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టు అప్రజాస్వామికం

**ఉట్నూర్,మార్చి 24, ప్రభాతవార్త :**

బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్ ఎస్సై విజయ ఆధ్వర్యంలో పోలీసులు బి ఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ తో పాటు నాయకులు సాడిగే రాజ్ కుమార్, బాబా శ్యామ్ క్రాంతి పవార్,దినేష్ లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి ఉట్నూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మాట్లాడుతూ.. ఏ చిన్న కార్యక్రమం అయినా అరెస్టులతో ఆగమాగం అవుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని అన్నారు.అడుగడుగునా అక్రమ అరెస్టులతో ముందుకు సాగుతున్న రేవంత్ సర్కార్.సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 12000 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసినాడని అదే విధంగా విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తా అని చెప్పి మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఇంత వరకు కాలేజీ విద్యార్థులకు స్కాలర్షిప్ గాని ఫీజు రియంబర్స్మెంట్ కానీ ఇవ్వలేదని తెలిపారు. ఇలాంటి అక్రమ అరెస్ట్ లు ఎన్ని చేసిన ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.

## సీఎం కప్ బంగారు పతాక విజేతలకు సన్మానం

**ఉట్నూర్,మార్చి 24, ప్రభాతవార్త :**

ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో బంగారు పథకాలు సాధించిన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను మంగళవారం ఉట్నూర్ కార్యాలయంలోని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ సన్మానించారు.ఖో ఖో లో విజేతలుగా నిలిచిన ఎం నిచల్ కుమార్,కే సురేందర్, ఎస్ శంకర్,ఏ మాధవరావు పి హనుమంతరావు, పి రంజిత్ ఎస్ జైతులతో పాటు అథ్లెటిక్స్ లో రెండు పథకాలు గెలుపొందిన హెచ్ కె నగేష్ లను మెడల్స్ తో సత్కరించారు, రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో గెలుపొందిన విధితో పాటు కోచ్ లను ఎన్ శివకృష్ణ కుమారులను సైతం అభినందించారు, భవిష్యత్తులో మరింత రాణించాలని అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని చెప్పారు, ఈ కార్యక్రమంలో డిడి జాదవ్ అంబాజీ, డీఈఓ జి చందన్, ఏపీఓపివిటి జి ఆత్రం భాస్కర్, ఏ సిఎంఓలు ఏ జగన్, పి ఉద్ధవ్, లక్ష్మయ్య, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి జిసిడిఓ ఛాయా, జై హేమంత్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

# ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలి

● జిల్లా కలెక్టర్ హరిత

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త**

నీటిని ఇంకించి కరువును జయిస్తేనే మానవాలికి మనుగడ అని ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టు కోవాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. మంగళ వారం కాగజ్ నగర్ మండలంలోని జంబుగా గ్రామంలో రైతు నివేదికలో భూగర్భ జల శాఖ సమృద్ధి సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రపంచ నీటి దినోత్సవం 2026 కార్యక్రమానికి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో దేశాలు సముద్రపు ఉప్పు నీటిని శుద్ధి చేసుకుని వినియోగిస్తున్నారని కానీ మన దేశంలో బోర్లు, బావులు, చేతి పంపుల ద్వారా వచ్చేశుద్ధమైన నీటిని వినియోగిస్తున్నాం అని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టుకొని సురక్షితమైన భూగర్భ నీటి మట్టాన్ని పెంచాలని వాగులపై చెక్ డ్యాములు, నీటి కుంలు,బోర్ల సమీపంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి నీటి మట్టం పెరుగుతుందని దీని ద్వారా సాగు నీటి, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఏటా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే నమోదవుతున్న, పుష్కలంగా నీరు పొదుపుగా వినియోగించుకోకపోవడం, ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడం, భూగర్భ నీటిమట్టం పడిపోయి సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజావాణిలో చాలా దరఖాస్తులు చేతి పంపులు మంజూరు చేయాలని అర్జీలు వస్తుంటాయని తెలిపారు. భూగర్భ నీటిమట్టం పెర గాలంటే ప్రతి ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఒకప్పుడు ఇంట్లో అవసరా లకు మహిళలు చాలా దూరం నుండి నీటిని తీసుకు వచ్చేవారని, కానీ నేడు ప్రభుత్వం ఇంటింటికి శుద్ధ జలాన్ని అందిస్తుందని, వాటిని సక్రమంగా విని యోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతును సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ నీటి వనరుల శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, ఉద్యానవన శాఖ అధికారి నద్ని, ఇ.ఇ మిషన్ భగీరథ, సిద్దిక్ ఫిషరీస్, ఏడి సాంబశివరావు రైతులు తదితరులు పాల్గొన్నారు.




## అర్ధరాత్రి 12 గంటలకు బిఆర్ఎస్ విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు

**క్యాతన్‌పల్లి, మార్చి 24, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలం నుంచి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని నిరసిస్తూ బి.ఆర్.ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బి.ఆర్.ఎస్.వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, బి.ఆర్.ఎస్.వి జిల్లా నాయకులు జిలకర మహేష్,నస్పూరి శివ కుమార్, కుర్మ దినేష్‌లను రామకృష్ణాపూర్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని, ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ విద్యార్థులను ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం చదువుకు దూరం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యాశాఖకు 8 శాతం నిధులు కేటాయించడం విద్యా శాఖ పట్ల కాంగ్రెస్ వైఖరి అవగతం అవుతుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయడం లేదని,వెంటనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని, విద్యా రంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు.

## గ్రామాల అభివృద్ధికి జర్నలిస్టుల సహకారం ఎంతో అవసరం

**- సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్**

**జన్నారం, మార్చి 24, ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధికి జర్నలిస్టుల సహకారం ఎంతో అవసరమని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజ మార్పులో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విలేకరులు వారధిలా పనిచేయాలని కోరారు. అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పారదర్శకమైన పాలన అందించడంలో ప్రెస్ క్లబ్ సభ్యుల సహకారం ఉండాలని ఆకాంక్షించారు. నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జాడి వెంకటయ్య, కోశాధికారి శీల చంద్రశేఖర్, మండపల్లి కాంతయ్యలను పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానం అందుకున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. వార్తల సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ ప్రధాన కార్యదర్శి వాసాల నరేష్, ఉపాధ్యక్షులు జిల్లపెల్లి గోపాల్,సుతారి సుమలత వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

## - ప్రత్యేక పూజలు, హోమాలతో భక్తి పారవశ్యం

**బెల్లంపల్లి, మార్చి 24, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని బస్తీ ప్రాంతంలో ఉన్న శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నాదంతో ఆలయం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా లక్ష్మణ, ఆంజనేయ స్వామి సమేత సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. విగ్రహ దాతలైన జంగం రాధా నిత్య కళ్యాణం కుటుంబం, నవగ్రహ విగ్రహ దాతలు సల్లం సురేఖ రాజశేఖర్, ధ్వజస్తంభ దాత కుదిరే స్వరూప శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సింధూర, అనూష, కార్తీక్, అలాగే గది దాతలు ఆకుల విజయలక్ష్మి జనార్ధన్ రావు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొని హోమాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక హోమం భక్తులను ఆకట్టుకుంది. పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో హవన కార్యక్రమాలు జరిగి, ఆలయం మొత్తం పవిత్రతతో నిండిపోయింది. భక్తులు హోమాగ్నికి ఆహుతులు సమర్పిస్తూ స్వామివారి అనుగ్రహం కోరుకున్నారు. ఆలయ నిర్మాణ దాత జంగం నిత్య కళ్యాణం మాట్లాడుతూ, బెల్లంపల్లి బస్తి ప్రజల సహకారం వల్లే ఈ ఆలయం నిర్మాణం సాధ్యమైందని తెలిపారు. శ్రీరామ, లక్ష్మీ, గోదా సమేత వెంకటేశ్వర స్వామి నూతన దేవాలయం, విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ట మహోత్సవాలను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు హనుమాన్ చాలీసా పారాయణం, లలిత సహస్రనామ పారాయణం, ధ్వజ కుంభారాధన, భవన ప్రతిష్ట వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 25వ తేదీ ఉదయం 6 గంటలకు వేద స్వస్తి, నిత్య సేవా కాల యాగాలు, మహా ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాల్లో పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహోత్సవాల అనంతరం భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కలర్స్ దాతలు పి. సత్తమ్మ, మోహన్ లత, శీను, మూల విరాట్ విగ్రహ దాతలు పోతురాజు అంబికా రాధాకృష్ణ, సుదర్శన పేరుమాళ్ల విగ్రహ దాతలు ఆసం లత ఏడుకొండలు, గోదాదేవి విగ్రహ దాతలు ముఖ్య సుశీల రామచందర్, నందీశ్వర విగ్రహ దాతలు ముక్త సంజన విశాల్, గణపతి విగ్రహ దాతలు కొమ్మ మమత రాజేష్, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ దాతలు పెనుమల్ల సుజాత సత్యనారాయణ గౌడ్, ఆంజనేయ స్వామి విగ్రహ దాతలు గాజుల వసుధ శంకర్, వెంకటేశ్వర స్వామి విగ్రహ దాత అంకాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు. బస్తి ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేశారు. ఆలయం వద్ద ఏర్పాట్లు సక్రమంగా ఉండగా, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు. మొత్తం కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికత, సామూహిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.



# అసెంబ్లీ ముట్టడి ముందు అర్ధరాత్రి అరెస్టులు.. బీఆర్ఎస్ తీవ్రఖండన



## ప్రజా స్వేచ్ఛకు విఘాతం అంటున్న నేతలు - హామీల అమలుపై ప్రభుత్వానికి హెచ్చరిక

**మందమర్రి, మార్చి 24, ప్రభాతవార్త**

అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో అర్ధరాత్రి సమయంలో మందమర్రి పట్టణంలో జరిగిన అరెస్టులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, తోట సురేందర్, మాస్ వెంకటేష్, అచలేష్ పాండే, మొగరం శీను, ఉప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా తమ నిరసనలు తెలియజేసే హక్కు ఉందని, అయితే ప్రభుత్వం ఆ హక్కును హరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా స్వేచ్ఛ పై చేసిన వ్యాఖ్యలు అమల్లో కనిపించడంలేదని, అవి కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో ప్రజా వ్యతిరేకతను అణచివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసి, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**జన్నారం, మార్చి 24, ప్రభాతవార్త**



తెలంగాణ ప్రజా పాలనలో రైతును రాజును చేయాలనే లక్ష్యంతో రైతులకు రైతు భరోసా డబ్బులను విడుదల చేసిన సందర్భంగా నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, గుర్రం మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, అజ్మీర నందు నాయక్, జక్కు భూమేష్, మచ్చ శంకరయ్య, మామిడిపల్లి ఇందయ్య, ముత్యం సతీష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి గణేష్, గూగులావత్ రవి నాయక్, మెస్రం రాజ్ కుమార్, మాదాడి హనుమంతరావు, ముత్యం రాజన్న, కంప సుధీర్ కుమార్, ఓజ్జల వామన్, శంకర్ గౌడ్, గాజుల సత్తయ్య, మండాడి నాణేశ్వర్, షాకీర్ అలీ,ఆరే శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మెల్ అకాడమీలో ఘనంగా మినీ కార్మెల్ డే, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

## ముఖ్యఅతిథిగా బిషప్ జోసఫ్ తచ్చా పరంబత్ - యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

**మందమర్రి, మార్చి 24, ప్రభాతవార్త**




మందమర్రి పట్టణంలోని కార్మెల్ అకాడమీలో మినీ కార్మెల్ డే, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిషప్ జోసఫ్ తచ్చా పరంబత్ హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్మెల్ విద్యాసంస్థలు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకుని ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కార్మెల్ అకాడమీ డైరెక్టర్ ఫాదర్ జేవీఆర్ రెక్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.